క్లుప్తంగా

ఎమ్మెల్యే సామేల్‌ను కలిసిన నాయకులు



ఎమ్మెల్యే సామేల్‌తో జాజిరెడ్డిగూడెం మండలంలోని వివిధ గ్రామాల నాయకులు

అర్వపల్లి : తుంగతుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికైన మందుల సామేల్‌ను శుక్రవారం జాజిరెడ్డిగూడెం మండలంలోని కాసర్లపహాడ్, అర్వపల్లి, బొల్లంపల్లి గ్రామాల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో దిర్శనపు కృష్ణమూర్తి, లింగంపల్లి విజయ్‌కుమార్, నోముల వంశీ, మంచాల రామ్మూర్తి, ఇమ్మడి సోమయ్య, పందిరి సురేందర్, దిర్శనపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మృతులకు నివాళి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అన్నారం బ్రిడ్జి గ్రామానికి చెందిన సుందరి గౌరమ్మ ఇటీవల మృతి చెందింది. మృతురాలి కుటుంబాన్ని శుక్రవారం టీపీసీసీ కార్యదర్శి తూముల భుజంగరావు పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముత్తినేని శ్రీనివాస్, నకిరేకంటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గంగ భద్రారెడ్డి సతీమణి జానకమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో ఆమె మృతదేహాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ చల్లా వేణుధర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ తండ లింగమూర్తిగౌడ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా మూలమలుపు



చివ్వెంల-ముకుందాపురం రహదారిపై ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

చివ్వెంల : చివ్వెంల మండల కేంద్రం శివారులో చివ్వెంల-ముకుందాపురం రహదారిపై మూలమలుపు ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారిపై ఖమ్మం నుంచి సూర్యాపేటకు వెళ్తున్నాయి. కానీ ఈ మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనికితోడు రహదారి వెంట పిచ్చి చెట్లు కమ్ముకుని వాహనదారులకు ఇబ్బంది కలిగించేలా ఉన్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రహదారి వెంట పెరిగిన పిచ్చిచెట్లను తొలగించాలని, మూలమలుపు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

తారు రోడ్డు వేయించరూ..



రామచంద్రాపురం గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డు

మద్దిరాల : మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామానికి తారురోడ్డు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నేళ్లు అయినా గ్రామం రోడ్డు పరిస్థితి మారడం లేదని ఆ గ్రామ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రోడ్డు మంజూరైనప్పటికీ ఇంత వరకు పనులు మొదలు ప్రారంభించలేదని, అధికారులు వెంటనే స్పందించి పనులు ప్రారంభించాలని వారు కోరుతున్నారు.

కమ్ముకున్న చెట్లు.. ప్రమాదకరంగా విద్యుత్‌వైర్లు



అర్వపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలో విద్యుత్ లైన్‌కు అల్లుకుపోయిన చెట్ల తీగలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండంలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లకు చెట్ల తీగలు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారాయి. మూగజీవాలు మేతకు వెళ్లినప్పుడు కరెంట్ తీగలకు అల్లుకుపోయిన చెట్ల తీగలను మేస్తూ విద్యుదాఘాతానికి గురై మరణిస్తున్నాయి. గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, విద్యుత్ లైన్లకు అల్లుకుపోయిన చెట్ల తీగలను తొలగించి ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.

సన్న ధాన్యానికి డిమాండ్

- సన్న రకం ధాన్యం సాగు తగ్గినందున పెరుగుతున్న ధరలు
- మార్కెట్‌లో కొత్త బియ్యం క్వింటాల్ ధర రూ.4400



తిరుమలగిరి మార్కెట్‌లో ధాన్యం రాశులు

తిరుమలగిరి : సన్న ధాన్యం సాగు తగ్గిపోవడంతో డిమాండ్ ఎక్కువై ధరలు పెరుగుతున్నాయి. సన్న బియ్యం వినియోగం ఎక్కువగా ఉండటం, అందుకు తగ్గట్లుగా ఉత్పత్తి లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. తిరుమలగిరి మండలంలో ఈ వానాకాలం సీజన్‌లో 14,500 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. ఇందులో 10 వేల ఎకరాల్లో దొడ్డు రకం, 4500 ఎకరాల్లో మాత్రమే సన్న రకం ధాన్యాన్ని పండించారు. రైతులు దొడ్డు రకం ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. సన్న రకాన్ని మాత్రం వ్యవసాయ మార్కెట్‌లో, ప్రైవేట్‌గా బయటి వ్యక్తులకు, మిల్లర్లకు విక్రయిస్తున్నారు. గత సీజన్‌లో సన్న ధాన్యాన్ని కూడా ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయించిన రైతులు ప్రస్తుతం ఒక క్వింటాల్ కూడా తీసుకరావడం లేదు.

మంచి ధర..

సన్నాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడటంతో మార్కెట్‌లో ట్రేడర్లు పెద్ద ఎత్తున రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర గ్రేడ్-ఏ క్వింటాల్‌కు రూ.2203, సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2180 ధర చెల్లిస్తున్నారు. సన్నాలకు వ్యవసాయ మార్కెట్‌లో బీపీటీ, ఆర్ఎన్ఆర్‌లు క్వింటాల్‌కు రూ.2600 నుంచి రూ.3000 పైగా ధర వస్తోంది. దీంతో రైతులు సన్న రకం ధాన్యాన్ని మార్కెట్‌లోనే విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. అయితే కొంతమంది రైతులు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందనే ఉద్దేశంతో ధాన్యాన్ని విక్రయించకుండా నిల్వ చేస్తున్నారు. మరి కొంతమంది సన్న ధాన్యాన్ని పట్టించి బియ్యాన్ని అమ్ముతున్నారు. స్థానిక వ్యాపారులు సన్నాలను బియ్యంగా పట్టించి నేరుగా వినియోగదారులకు విక్రయించేందుకు సన్న ధాన్యాన్ని కొంటున్నారు. రైతులు సైతం మిల్లులలో సన్నాలను పట్టించి తినేందుకు వీలుగా బియ్యాన్ని నిల్వ చేసుకుంటున్నారు.

బియ్యం ధరలు కూడా..

సాధారణంగా వానాకాలం సీజన్ ముగియగానే కొత్త బియ్యానికి క్వింటాల్‌కు రూ.3500 నుంచి రూ.4 వేల వరకు ధర ఉండేది. కానీ గత రెండు సంవత్సరాలుగా సన్న రకాలకు కూడా తక్కువ ధరలే ఉన్నాయి. అయితే ఈ సీజన్‌లో అనూహ్య రీతిలో ధరలు పెరిగాయి. ప్రస్తుతం మార్కెట్‌లో బీపీటీ, ఆర్ఎన్ఆర్ తదితర సన్న బియ్యానికి క్వింటాల్‌కు రూ.4400 వరకు ధర పలుకుతుంది. పాత బియ్యానికి క్వింటాల్‌కు రూ.6 వేల ధర ఉంది.

మార్కెట్‌లోనే ధాన్యం విక్రయించా



ఈసారి 70 బస్తాల సన్న ధాన్యం దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో 30 బస్తాల ధాన్యాన్ని క్వింటాల్‌కు రూ.2659కి అమ్మాను. మరో 40 బస్తాల ధాన్యాన్ని తినడానికి బియ్యం పట్టించాను. మద్దతు ధరకు మించి ధర వస్తుండటంతో మార్కెట్‌లోనే ధాన్యం అమ్ముకున్నా.

– జిలుకర రామస్వామి, రైతు

ఈసారి మంచి ధరలే ఉన్నాయి



గతంలో ఎన్నడూ లేని విధంగా సన్నరకం ధాన్యానికి మంచి ధరలు వచ్చాయి. నేను వ్యవసాయ మార్కెట్‌కు 25 బస్తాల ధాన్యం తీసుకొచ్చా. క్వింటాల్‌కు ధర రూ.3067 పలికింది. మంచి ధర రావడంతో సంతోషంగా ఉన్నా.

– ఎండీ.ఖలీల్, రైతు

పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

దురాజ్‌పల్లి : ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ సిహెచ్.ప్రియాంకతో కలసి పాల్గొని మాట్లాడారు. సూర్యాపేట జిల్లా ఏర్పడిన నాటి నుంచి టీఎస్ఐపాస్ కింద 20శాఖలకు సంబంధించి 952 దరఖాస్తులు అందాయని తెలిపారు. వాటిలో ఇప్పటివరకు 758 దరఖాస్తులను పరిశీలించి అనుమతులు ఇచ్చామని, 127 దరఖాస్తులను తిరస్కరించినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కువగా రైస్ మిల్లులు, ప్లాస్టిక్, సిమెంట్ ఫ్యాక్టరీస్, సిమెంట్ బ్రిక్స్‌లకు దరఖాస్తు చేసుకుంటున్నారని తెలిపారు. జిల్లాలో లబ్ధిదారులు పారిశ్రామిక కేంద్రాల ఏర్పాటుకు చేసుకున్న దరఖాస్తులను పరిశీలన చేసి అనుమతులు ఇవ్వాలని సూచించారు. జిల్లాలో టీప్రైడ్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ ఆర్థిక స్వావలంభన దిశగా పారిశ్రామిక రంగంలో ఎక్కువగా ప్రోత్సహించాలని అన్నారు. సమావేశంలో జీఎం పరిశ్రమలు తిరుపతయ్య, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి, పొల్యూషన్ బోర్డ్ ఏఈ శంకర్‌బాబు పాల్గొన్నారు.

దేవతామూర్తుల విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ



వేదాంత భజన మందిరంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

భానుపురి : పట్టణంలోని వేదాంత భజన మందిరంలో రంగనాథస్వామి, గోదాదేవిల ఉత్సవ విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు ధరూరి సింగరాచార్యులు, రాఘవాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం హోమం, నవ కలశాభిషేకం నిర్వహించారు. అనంతరం రంగనాథస్వామి, గోదాదేవిల ఉత్సవ విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాచర్ల వెంకటేశ్వరరావు, కార్యదర్శి నకిరేకంటి నాగరాజు, కోశాధికారి సోమ అశోక్, పులిగిల్ల అర్జున్‌గుప్త, వీరవెల్లి రామ్మూర్తి, సోమా రవికుమార్, వాసా కృష్ణ, వెంకటేశ్వర్లు, సోమా పవన్, శీలా శంకర్, ఈగ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

17న విజ్ఞాన కేంద్ర ప్రారంభోత్సవ సభ



అర్వపల్లి : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

అర్వపల్లి : నూతనకల్ మండల కేంద్రంలో ఈ నెల 17న జరిగే గునగంటి సత్యనారాయణ విజ్ఞాన కేంద్ర ప్రారంభోత్సవ సభను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ కోరారు. శుక్రవారం జాజిరెడ్డిగూడెంలో సభ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. నూతనకల్‌లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యాలయానికి గునగంటి సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, కుమార్తె అన్వేష్, సమతలు భవనాన్ని నిర్మించారని చెప్పారు. ఈ కార్యాలయాన్ని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జేవీ చలపతిరావు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సభకు ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విద్యార్థులు, యువకులు అధిక సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా నాయకుడు కదారి సైదులు, వేముల గణేష్, ఏర్పుల గంగయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : మండల కేంద్రంలో గునగంటి సత్యనారాయణ జ్ఞాపకార్థం నిర్మించిన విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవ సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు పెద్దింటి రంగారెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 17న ప్రారంభోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రజాస్వామిక వాదులు, మేధావులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జక్కుల మల్లయ్య, మున్నా అశోక్, కూసు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : నూతనకల్లు మండల కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు గునగంటి సత్యనారాయణ జ్ఞాపకార్థం నిర్మించిన విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవం ఆదివారం ఉంటుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు సామ నర్సిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పాతసూర్యాపేటలో విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవ సభ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేడబోయిన సైదులు, కునుకుంట్ల లక్ష్మారెడ్డి, సూరారపు ముత్తయ్య, చెరుకుపల్లి రవి, బొక్క వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదో విడత హరితహారానికి ఏర్పాట్లు



ఎన్ అన్నారంలో నర్సరీని పరిశీలిస్తున్న ఏపీఓ



మహ్మదాపురంలో మొక్కలకు నీళ్లు పోస్తున్న సిబ్బంది

- పెన్‌పహాడ్ మండలంలోని నర్సరీల్లో 2.34 లక్షల మొక్కల పెంపకం లక్ష్యం
- బ్యాగుల్లో మట్టి నింపే పనులు పూర్తి

పెన్‌పహాడ్ : హరితహారం పదో విడత కార్యక్రమానికి అవసరమైన మొక్కలను పెంచేందుకు అధికారులు నర్సరీలను సిద్ధం చేస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా వన్ విలేజ్ వన్ నర్సరీ పేరుతో ప్రతి గ్రామంలో మొక్కల పెంపకానికి నర్సరీలను పెంచుతున్నారు. పెన్‌పహాడ్ మండల పరిధిలోని మొత్తం 29 గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాల విస్తీర్ణం, జనాభా, మొక్కలను నాటేందుకు గల స్థల సదుపాయానికి అనుగుణంగా మొక్కల సంఖ్యను నిర్ధారించి పెంచుతున్నారు.

లక్ష్యం 2.34 లక్షల మొక్కలు..

పెన్‌పహాడ్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 29 నర్సరీల్లో 2.34లక్షల మొక్కలను పెంచేందుకు అధికారులు లక్ష్యం నిర్దేశించారు. ఆయా నర్సరీల నిర్వహణకు మొక్కల సామర్థ్యాన్ని బట్టి నిధులను కేటాయిస్తున్నారు. ఇప్పటికే సీడ్ ట్రీట్‌మెంట్ చేపట్టి, ఎస్ఎస్‌పీ వంటి డీకంపోజ్ ఎరువులతో, సారవంతమైన మట్టితో బ్యాగ్ ఫిల్లింగ్ చేపట్టి విత్తనాలను విత్తారు.

పకడ్బందీగా నర్సరీల నిర్వహణ



పెన్‌పహాడ్ మండలంలో అన్ని నర్సరీల్లో నిర్దేశించిన మొక్కలను పెంచి వాటిని సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో మొత్తం 2.34లక్షల మొక్కల పెంపకాన్ని నిర్దేశించాం. టేకు మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామ పంచాయతీలు నర్సరీలను నిర్వహిస్తున్నాయి. వారికి అందాల్సిన బిల్లులు ఈజీఎస్ ద్వారా అందిస్తాం.

– బాణాల శ్రీనివాస్, ఎంపీడీఓ

కనిపించని టేకు మొక్కలు..

రైతులు తమ పంట పొలాల గట్లపై మొక్కలను పెంచేందుకు అనువైన టేకు మొక్కల పెంపకం ఈ ఏడాది నర్సరీల్లో కనిపించడం లేదు. హోంస్టేడ్, ఎవెన్యూ ప్లాంటేషన్‌కు సంబంధించి జామ, నిమ్మ, దానిమ్మ, ఉసిరి వంటి పండ్ల మొక్కలతో పాటు చింత, కానుగ, మునగ, సుబాబుల్, గుల్‌మోర్ వంటి మొక్కలను పెంచుతున్నారు. స్టంప్స్ కొనుగోలు చేసి టేకు మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలియజేస్తున్నారు.

కేసులు ఎత్తివేయాలని ప్రజావాణిలో దరఖాస్తు



ప్రజావాణిలో దరఖాస్తు చేసిన పేరాల గోపి

నాగారం : మండల పరిధిలోని ఈటూరు గ్రామానికి చెందిన తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకుడు పేరాల గోపి తనపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో జరిగిన ప్రజావాణిలో దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2009లో తెలంగాణ విద్యార్థి వేదిక (టీవీవీ) ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నానని, తెలంగాణ వచ్చిన తరువాత 2019లో తనకు మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని పోలీసులు పలు జిల్లాల్లో అక్రమ కేసులు నమోదు చేశారని అన్నారు. మూడేళ్లు తాను పరారీలో ఉన్నట్లు ఆరోపిస్తూ 2022లో అరెస్టు చేసి 7నెలల పాటు జైలులో నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను మూడేళ్ల పాటు పీజీ, ఎల్ఎల్‌బీ విద్యనభ్యసిస్తూ హైదరాబాద్‌లో ఉన్నట్లు చెప్పారు. ఒక నిరుద్యోగిగా పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నందున భవిష్యత్తులో ఇబ్బందులు కలగకుండా తనపై మోపిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరారు.

రోడ్డుపైనే సంత.. రాకపోకలకు తిప్పలు



అర్వపల్లిలో కాసర్లపహాడ్‌రోడ్డుపై చిరు వ్యాపారులు ఏర్పాటు చేసిన దుకాణాలు



సంతకు వచ్చే వారితో రద్దీగా మారిన రోడ్డు

అర్వపల్లి : అర్వపల్లిలో వారాంతపు సంత రోడ్డుపైనే జరుగుతుండటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అర్వపల్లిలో ప్రతి మంగళవారం వారాంతపు సంత (అంగడి) జరుగుతుంది. కాసర్లపహాడ్‌రోడ్డులో దారి వెంట దేవాదాయ శాఖ కేటాయించిన స్థలంలో గతంలో ఈ సంతను ఏర్పాటు చేశారు. అప్పట్లో పశువులు, జీవాలు, కూరగాయలు, నిత్యావసర సరుకుల క్రయవిక్రయాలకు గానూ ఈ స్థలంలో ప్రదేశాలను కేటా యించారు. కానీ కేటాయించిన స్థలంలో ప్రస్తుతం చిరు వ్యాపారులు ఇష్టారీతిన తోపుడు బండ్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. రోడ్డుపైనే తోపుడు బండ్లను ఉంచుతుండడంతో నిత్యావసర సరుకులు, కూరగాయలు, పండ్లు, ఇతర దుకా ణాల వ్యాపారులు కూడా రోడ్డుపైనే దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఈ దారి నుంచే కాసర్లపహాడ్, కొమ్మాల, కోడూరు, లోయపల్లితో పాటు ఐదారు గ్రామాల ప్రజలు, పలు తండాల గిరిజనులు నిత్యం రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. కానీ ప్రతి మంగళవారం వార సంత సందర్భంగా ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారసంత రోజున సంతకు కేటాయించిన స్థలంలోనే చిరు వ్యాపారులు దుకాణాలు పెట్టుకునేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. అలాగే దేవాలయం రోడ్డులో అంగడి రోజు ఎలాంటి దుకాణాలు పెట్టకుండా ట్రాఫిక్ సాఫీగా వెళ్లేలా పోలీసులు చర్యలు చేపట్టాలని స్థానికులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆంజనేయ మాలధారుల ఇరుముడి



నాగారంబంగ్లాలోని భక్తాంజనేయ స్వామి ఆలయం ఎదుట పూజలు చేస్తున్న మాలధారులు

నాగారం : నాగారంబంగ్లా గ్రామంలో ఉన్న భక్తాంజనేయస్వామి ఆలయంలో నాగారం, నాగారంబంగ్లా గ్రామాలకు చెందిన ఆంజనేయ స్వాములు శుక్రవారం ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. మాల ధరించి 41రోజులు పూర్తి కావడంతో భక్తాంజనేయ ఆలయంలో హోమం, సహస్రనామార్చన, అభిషేకం, పుణ్యాహవాచకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇరుముడి కట్టుకొని మద్దిమడుగుకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో అంజనేయస్వాములు కన్నెబోయిన అవిలయ్య, చీమల వెంకన్న, కన్నెబోయిన వెంకటయ్య, కన్నెబోయిన అనిల్, నీలం లింగయ్య, కన్నెబోయిన కుమార్, అనంతుల సోమేష్, బింగి మల్లయ్య, బుర్రి సురేష్‌రెడ్డి, చిరిక నరేందర్‌రెడ్డి, అంజయ్య, అర్చకులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు 'పది' విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

కోదాడఅర్బన్: పట్టణంలోని ఎస్ఆర్ఎస్ జూనియర్ కాలేజీలో పదో తరగతి విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్‌ల ఆధ్వర్యంలో ఈనెల 17న (ఆదివారం) టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి చేపూరి కొండలు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మనబోయిన నరేష్ శుక్రవారం తెలిపారు. ఈ పరీక్షలో మొదటి ర్యాంక్ సాధించిన వారికి మొదటి బహుమతిగా రూ.5వేలు, షీల్డ్, ప్రశంస పత్రం, ద్వితీయ బహుమతి కింద రూ.4వేలు, షీల్డ్, ప్రశంస పత్రం, తృతీయ బహుమతి కింద రూ.3వేలు, షీల్డ్, ప్రశంస పత్రం, చతుర్థ బహుమతి కింద రూ.2వేలు, షీల్డ్, ప్రశంస పత్రం, పంచమ బహుమతిగా రూ.1,000లు, షీల్డ్, ప్రశంస పత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ సాబ్జీ మృతి బాధాకరం

కోదాడఅర్బన్ : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సంఘం ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు. అనంతరం వారు మాట్లాడారు. మంచి గళం ఉన్న ఉపాధ్యాయ ఉద్యమనేతగా, ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ యూటీఎఫ్ నాయకుడిగా ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడిన నాయకుడు షేక్ సాబ్జీ అని వారు కొనియాడారు. కార్యక్రమంలో ఆడిట్ కమిటీ సభ్యులు టీఏ జనార్దన్, అనంతగిరి, కోదాడ మండల శాఖ అధ్యక్షులు ఉపేందర్, ఆంజనేయులు, పిచ్చయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

మునగాల : మండలంలోని వెంకట్రాంపురం గ్రామ పంచాయతీ శివారు గ్రామమైన ఎస్ఎంపేట గ్రామానికి చెందిన మందపల్లి సంతోష్, అతడి భార్య, పెద్దకూతురు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో సంతోష్ కుటుంబంలో మిగిలిన మరో కుమార్తెను ఆదుకునేందుకు అతడి చిన్ననాటి స్నేహితులు ముందుకువచ్చారు. మండల కేంద్రలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99లో పదోతరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు రూ.2లక్షలు సేకరించి శుక్రవారం గ్రామంలో సంతోష్ కుమార్తె గగనకృష్ణ పేరు మీద బ్యాంకులో డిపాజిట్ చేసిన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సంతోష్ మిత్రులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు వర్ధంతి

నడిగూడెం : నడిగూడెం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట శుక్రవారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ చిల్లంచర్ల సత్యనారాయణ, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు ఎండీ.జలీల్, పుల్లయ్య చౌదరి, వెంకటేష్, గోవర్ధన్, సాయి, ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

ఆత్మకూరు (ఎస్) : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ హర్షవర్ధన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఉన్న వసతులను పరిశీలించారు. అలాగే పలు రికార్డులను తనిఖీ చేశారు. కుక్క కాటు, పాముకాటు నివారణకు సంబంధించిన మందుల నిల్వలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు గోవిందమాల మహా మండల పూజ



వేంకటేశ్వరస్వామి ఆలయంలో మండల పూజకు సిద్ధమవుతున్న వేదిక

భానుపురి : పట్టణంలోని పద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం మహా మండల పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు శుక్రవారం తెలిపారు. ప్రతి సంవత్సరం గోవింద మాల దీక్ష స్వీకరణ చేసిన భక్తుల ఆధ్వర్యంలో మండల పూజా కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. గోవింద మాల దీక్ష ప్రారంభమై 25 ఏళ్లు అయిన సందర్భంగా రజతోత్సవ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీవేంకటేశ్వర స్వామి వారికి సహస్ర కలశాభిషేక మహోత్సవం (1008 కలశములతో అభిషేకం) త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహ పాత్రులు కావాల్సిందిగా కోరారు. పూజ అనంతరం భక్తులందరికీ అన్నప్రసాదాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గోవింద మాల భక్తులు గుండా శ్రీనివాస్, దంతాల నాగరాజు, బూర నాగరాజు, మట్టా రమేష్, దంతాల శేఖర్, వెంకటాచారి పాల్గొన్నారు.

బడి బయటి పిల్లల గుర్తింపు సర్వే



తిరుమలగిరి : జేత్యాతండాలో సర్వే నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



నాగారం : డి.కొత్తపల్లిలో..

తిరుమలగిరి : మండలంలోని జేత్యాతండా ప్రాథమిక పాఠశాల పరిధిలో శుక్రవారం బడి బయటి పిల్లల గుర్తింపు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదగిరి మాట్లాడారు. బడి ఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉండాలని కోరారు. చదువు మధ్యలో మానేసిన పిల్లలను గుర్తించడంతో పాటు పాఠశాలలకు వెళ్లని విద్యార్థులను గుర్తించి పాఠశాలల్లో చేర్పడానికి ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట సీఆర్పీ సోమేశ్వర్ ఉన్నారు.

డి.కొత్తపల్లి, పస్తాల గ్రామాల్లో..

నాగారం : మండల పరిధిలోని డి.కొత్తపల్లి, పస్తాల గ్రామాల్లో బడి బయట ఉండే పిల్లలను గుర్తించేందుకు క్లస్టర్ సీఆర్పీలు శుక్రవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చదువు మధ్యలో మానేసిన పిల్లలను గుర్తించడంతో పాటు పాఠశాలలకు వెళ్లని వారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించడానికి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బడి బయటి పిల్లల వివరాలను తెలుసుకొని ప్రబంద్ పోర్టల్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు హరిప్రసాద్, స్వామిగౌడ్, ఆయా గ్రామాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు పిల్లల గుర్తింపు

అర్వపల్లి : బడి బయట ఉండే, మధ్యలో బడి మానేసిన పిల్లల గుర్తింపునకై చేపట్టిన ఇంటింటి సర్వేలో జాజిరెడ్డిగూడెం మండలంలో ఇప్పటి వరకు నలుగురు పిల్లలను గుర్తించినట్లు ఎంఈఓ బాలు నాయక్ తెలిపారు. తిమ్మాపురం, జాజిరెడ్డిగూడెం రెండు కాంప్లెక్స్‌ల పరిధిలో సీఆర్పీలు, ఐఈఆర్పీలు ఇంటింటి సర్వే చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు వెంకట్‌రెడ్డి, జానయ్య, ఐఈఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.